

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

సోమవారం 26 జనవరి 2026 - పేజీలు 10


# ఓటుతో ప్రతి ఒక్కరికీ సమానత్వం





“అన్ని వర్గాలకు ఓటు హక్కును కల్పించిన ఘనత మన దేశానికి దక్కుతుందన్నారు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా. ఓటరుగా సమాజాన్ని తీర్చిదిద్దరంలో కీలక పాత్ర వహించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి కోరారు.”

గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్: ఓటుతో ప్రతీ ఒక్కరికీ సమానత్వం లభించిందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఓటరు అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందన్నారు. కుల, మత బేధాలు లేకుండా వయోజనులందరికీ ఓటు హక్కును కల్పించడం ద్వారా సమాన అవకాశాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని చెప్పారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి కీలకమని పేర్కొన్నారు. ఓటు హక్కు సక్రమంగా

మిగతా 2 లో..



# వైభవంగా రథ సప్తమి వేడుకలు

## సప్త వాహనాలపై స్వామివారి దర్శనం

మంగళగిరి, మేజర్ న్యూస్: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మంగళగిరి పట్టణంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు.

మిగతా 2 లో..

# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

## నగర కమిషనర్ కె.మయూర్ అశోక్



గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ : ఈ నెల 26వ తేది సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల వలన “ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక“ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం రద్దు చేయడమైనదని, నగర ప్రజలు గమనించి, ఏమైనా స్థానిక సమస్యలు ఉంటే జిఎంసి కాల్ సెంటర్ 0863 2345103 కి కాల్ చేయవచ్చని తెలిపారు.

# కళలు, నాటక రంగం, వంటి సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలి



- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు
- రూ. 5 లక్షలతో భువన చంద్ర టౌన్ హాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిశీలన

2 లో

నరసరావుపేట మేజర్ న్యూస్ : నరసరావుపేట పట్టణంలోని భువన చంద్ర టౌన్ హాల్లో రూ.5 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆదివారం ఉదయం

# ఓటర్లలో చైతన్యమే.. ప్రజాహిత సుపరిపాలనకు పునాది





గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ : జనవరి 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం. మనదేశంలో ఓటరు ద్వారా ఎన్నుకోబడిన రాజకీయ పార్టీల పరిపాలన వ్యవస్థలు ఏ విధంగా ఉన్నాయో ప్రతి ఒక్క ఓటరు విశ్లేషించుకోవలసిన సందర్భం ఇది .ప్రజాస్వామ్యయుత పార్లమెంటరీ పరిపాలన విధానంలో ఓటు విలువ నేడు చాలా మందికి తెలిసిందే. అ యినా (ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల) ఓటర్లుఅనేక ప్రలోభాలకు లొంగిపోయి ఓటు హక్కును వినియోగించుకుంటున్నార నడంలో ఎంత మాత్రం సందేహం అక్కర్లేదు . నేడుఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులు గాని, చిన్న పార్టీల అభ్యర్థులు గాని ఎక్కడా మూడు అంకెల ఓట్లైనా పొందిన దాఖలాలు

2 లో

# గుంటూరు జిల్లా స్కూల్ లెవెల్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం



## ముఖ్యఅతిథిగా పొన్నూరు శాసన సభ్యులు సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరు, మేజర్ న్యూస్: పొన్నూరు పట్టణం లైన్స్ క్లబ్లోలో ఆదివారం గుంటూరు జిల్లా స్థాయి స్కూల్ లెవెల్ చెస్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొన్నూరు శాసన సభ్యులు సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు జిల్లా నలుమూలల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చిన్న వయసులోనే విద్యార్థులు చెస్ వంటి మేధో క్రీడలో చూపిస్తున్న ప్రతిభ ప్రశంసనీయం అని అన్నారు. చెస్ ఆట విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యం, సహనం, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుందని అన్నారు. ఇలాంటి పోటీలు

2 లో

# గుంటూరు జిల్లా స్కూల్ లెవెల్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం



మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల మేధస్సును మెరుగుపరచడమే కాకుండా భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల పిల్లల్లో కూడా అపారమైన ప్రతిభ ఉందని, వారికి సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందితే మరింత మంది గ్రాండ్‌మాస్టర్లు, జాతీయ స్థాయి క్రీడాకారులు మన రాష్ట్రం నుంచి రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. చెస్ కోచ్‌లు నిర్వాహకులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో మేధో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను చదువుతో పాటు చెస్ వంటి మానసిక అభివృద్ధికి దోహదపడే క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని, మేధో క్రీడల్లో రాణించే విద్యార్థులకు కూడా భవిష్యత్తులో ప్రోత్సాహక పథకాలు, అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థి విజేతగానే భావించాలని, గెలుపు-ఓటములు సహజమని, ముఖ్యమైనది పాల్గొనడం నేర్చుకోవడమేనని విద్యార్థులకు సందేశం ఇచ్చారు.

## కళలు, నాటక రంగం, వంటి సాంస్కృతిక

# వారసత్వాన్ని కాపాడుకోవాలి



మొదటి పేజీ తరువాయి

పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని సంబంధిత అధి కారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగు వారి కళా సాంప్ర దాయం, కలలు, నాటక రంగం వంటి సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకో వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. కళాకారులకు తగిన వేదికలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని స్పష్టం చేశారు. భువన చంద్ర టౌన్ హాలును మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి, కళాకారులకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుత్తా అంకమ్మ చౌదరి, బచ్చులకూరి క్రాంతి, లావు రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లలో చైతన్యమే.. ప్రజాహిత సుపరిపాలనకు పునాది

మొదటి పేజీ తరువాయి

కనబడవు. వీరిలో ఎంత మంచివారున్న, నిత్యసంఘ సేవకులు, నిజాయితీపరులు, నిస్వార్ధపరులున్న ,దేశం, రాష్ట్రం పాడైపోతుశీదన్న ఆవేదనతో, ఆందోళనతో సొంత డబ్బునే ఖర్చు పెట్టుకుని, ఎంత ప్రచారం చేసిన ఫలితాలు ఎంత అన్యాయంగా ఉంటున్నాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. గతంలో దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కొంతమంది అయినా స్వతంత్ర అభ్యర్థులు, స్థానిక పార్టీల అభ్యర్థులు గెలిచేవారు. చట్టసభలలో వారి గళం గట్టిగా వినిపించేవారు. ఈవేళ ఆ పరిస్థితులు లేవు. ప్రతి లోక్ సభ, శాసనసభ నియోజకవర్గంలలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలతో పాటు ఆయా రాష్ట్రాలలో రిజిస్టరైన ,ఈసీఐ గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులు ,స్వతంత్ర అభ్యర్థులు మొత్తం మీద 30 నుంచి 40 మంది అభ్యర్థుల పేర్లు బ్యాలెట్ పేపర్లో ఉంటున్నాయి. అయితే అందులో ఒక పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు, ప్రత్యర్థి పార్టీ ఓట్లు చీల్చేందుకు పోటీ చేస్తున్న అభ్యర్థులు లేకపోలేదు. నిజానికి ఈ దశాబ్దాపు ఎన్నికలలో వీరి బెడద ఎక్కువగానే ఉందని చెప్పవచ్చు. ప్రస్తుత దేశ ,రాష్ట్రాల పరిస్థితుల దృష్ట్యా ఇకనైనా విజ్ఞులైన ఓటర్ల ఆలోచన విధానం మారాలి.

### ఏదో ఒక పార్టీకే భారీ మెజారిటీ

ఏదో ఒక పార్టీకే భారీ మెజారిటీ ...అటు సీట్ల సంఖ్య పరంగాను ,ఇటు ఓట్ల పరంగాను ఇస్తే రాష్ట్రానికి, దేశానికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఇప్పుడు మనం అదే ప్రత్యక్షంగా చూస్తున్నాం. రాజకీయ పార్టీలకు మ్యాజిక్ ఫిగర్ ని మించి ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన, సుస్థిర ప్రభుత్వాన్ని ఇచ్చే సంఖ్య లో అభ్యర్థులను గెలిపిస్తేనే ..పరిపాలన సమర్ధవంతంగా ఉంటుంది . పటిష్టమైన ప్రతిపక్షానికి అవకాశం ఏర్పడుతుంది. ఏకపక్ష పోకడలు చాలావరకు నిరోధించబడతాయి. ఓటర్లు ఆయా నియోజక వర్గాల్లో చాలా కాలంగా స్థిరనివాసం ఉండి, తెలిసిన మంచి అభ్యర్థులను పరిశీలించి ఎన్నుకోవడం ప్రతి ఒక్క ఓటరు ప్రధాన బాధ్యత .ఇప్పుడు ఆ బాధ్యతను నిర్వర్తిస్తున్న ఓటర్లు సంఖ్య 99 శాతంకు తగ్గిపోయినందువల్లే నేడు పరిపాలనను, రాజకీయ వ్యవస్థను అధికార, ప్రతిపక్ష పార్టీలు భ్రష్టు పట్టిస్తున్నాయి. దేశ, రాష్ట్రాల భవిష్యత్తు ఐదేళ్లకు ఒకసారి ఓటరు చేతిలోకి వస్తుంది .అప్పుడు ఆలోచించి ,నిస్వార్ధంగా



,కుల, మత ,పార్టీలకతీతంగా మంచి అభ్యర్థిని ఎంచుకొని... ఓటు హక్కు వినియోగించుకుంటే దేశ భవిష్యత్తు ,రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుంది. ఓటు మన ప్రజాస్వామ్య యుతపరిపాలన వ్యవస్థకు మూలాధారం. పునాది. కేవలం ఓటర్ల... విచక్షణాయత ఓటు హక్కు వినియోగంపైనే మన దేశ, రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ఓటు విలువను రాజకీయ పార్టీలు గుర్తించినంతగా.. ఓటర్లు గుర్తించలేదు. అందుకు ఇప్పుడు ఎస్ ఐ ఆర్ పై జరుగుతున్న రగడే నిదర్శనం. ఈసీఐ దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఎస్ఐఆర్ ను నిర్వహిస్తుంటే ..ప్రతిపక్ష పార్టీలన్నీ నానా యాగి చేస్తున్నాయి .ఈ రెండు దశాబ్దాలలో చనిపోయిన ఓటర్లను ,రాష్ట్రం వదిలి వలస వెళ్లిన ఓటర్లను తొలగిస్తుంటే ఎంత హంగామా చేస్తున్నాయో చూస్తున్నాం .ఇక విదేశీయుల ఓట్ల విషయంలో కూడా రగడ జరుగుతూనే ఉంది .వారిని గుర్తించటం కేంద్ర హోమ్ శాఖ పని గానీ, ఈసీ పని కాదని ప్రతిపక్షాలన్నీ వాదిస్తున్నాయి. అడ్డదారులలో మనదేశంలోకి ప్రవేశించిన.. విదేశీయుల ఓట్లతో అయినా గెలవాలన్నది ఆ పార్టీల ఉద్దేశం . ఏ విధంగానైనా తామేఅధికారానికి రావాలన్న తపన తప్ప... ప్రజలకు మంచి పాలన అందించాలన్నది వాళ్ళ ఆలోచన కాదన్నది ఇక్కడ స్పష్టమవుతుంది. విదేశీ ఓటర్లలలో ఉగ్ర మూకలు ఉంటే... వారిని తమ గెలుపు కోసం ప్రోత్సహించి ఓటు హక్కు ఇస్తే.. రేపు శత్రు దేశాలతో చేతులు కలిపి దేశంలో విధ్వంసానికి పాల్పడితే ఆ పాపం ఎవరిది? అందుకే ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా ఆలోచించాలి .మన దేశ భవిష్యత్తు మన దేశ పౌరు డైన ఓటర్ చేతుల్లో ,చేతల్లోనే ఉంది.

**- డాక్టర్ టి.సేవకుమార్, గుంటూరు**



# ఓటుతో ప్రతి ఒక్కరికీ సమానత్వం

## జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

మొదటి పేజీ తరువాయి

వినియోగించుకోవడం ద్వారా సమాజంలో సమూలమైన మార్పులకు నాంది పలకవచ్చని తెలిపారు. ఓటు నమోదు ప్రక్రియను సైతం ఎన్నికల కమిషన్ సులభతరం చేసిందని ఆన్లైన్ ద్వారా నమోదు కావచ్చని అన్నారు. ఓటరుగా నమోదు కాకుండా మిగిలి ఉన్న యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు ఒక వజ్రాయుధమని దాని విలువ ఎంతో గొప్పదని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటు ప్రతి పౌరునిలో బాధ్యతను గుర్తు చేస్తుందని అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైనదని దానిని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికీ అనేక మంది ఓటు హక్కును వినియోగించుకోవడం లేదని ఓటరు సరళి చూసినపుడు అవగాహన అవుతుంద న్నారు. ఓటు వేయడం మన బాధ్యత, హక్కు అన్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ దేశంలో ఎన్నికల ప్రక్రియ ఓటు హక్కు వలన సజావుగా సాగుతోందన్నారు. బూత్ స్థాయి అధికారులు ఓటు నమోదు ప్రక్రియలో కీలకంగా వ్యవహరిస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఓటరు ప్రతిజ్ఞను చేయించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా, రాజకీయ పార్టీల ప్రతినిధులు - టీడీపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యారావు, ప్రతినిధులు ఓమ్ కార్, కంచర్ల శివ రామయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బిళ్ళా సునీల్, బి.ఎస్.పి ప్రతినిధి సి.హెచ్. వాసు, జనసేన పార్టీ ప్రతినిధి త్రినాథ్, అప్ పార్టీ ప్రతినిధి డాక్టర్ సేవ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా రథ సప్తమి వేడుకలు

మొదటి పేజీ తరువాయి



పట్టణంలో వేంచేసి యున్న శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో సప్త వాహనాలపై స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యప్రభ వాహనంతో రథసప్తమి వేడుక ప్రారంభమైంది. తరువాత శేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, రాజాధిరాజ వాహనం, నిర్వహించారు. చంద్రప్రభ వాహనంతో రథ సప్తమి ఉత్సవం ముగిసింది. పుర వీధుల్లో స్వామి వారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథసప్తమి నాడు స్వామివారిని దర్శించుకుంటే పుణ్యం వరిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.రథ సప్తమి వేడుకతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ఈవో కే సునీల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేవుని ఆశీర్వాదం..

# మహోత్సవాల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

- దేవునిపై విశ్వాసం... విజయానికి తొలి మెట్టు
- బైబిల్ మిషన్ అధ్యక్షులు,
- మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్. జె.శామ్యేల్ కిరణ్







**పెదకాకాని మేజర్ న్యూస్ :** దేవుని ఆశీర్వాదం మహోత్సవాల ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి అని బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ .జె. శామ్యేల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో వేయబడిన పందిరిలో 3 రోజులు పాటు జరిగే 88వ బైబిల్ మిషన్ మహోత్సవాలు అద్భుత కరంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మహోత్సవాల ప్రాంగణంలో కాకాని స్వస్తిశాల సంగీత బృందం ప్రత్యేక క్రైస్తవ భక్తి కీర్తనలు ఆలపించారు. అనంతరం మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ .జె. శామ్యేల్ కిరణ్ భక్తులను ఉద్దేశించి వాక్యోపదేశం అందించారు. మహోత్సవాలలో పాల్గొనడం ద్వారా ఆశీర్వాదము, దీవెన, అన్ని అంశాలలో విజయం సాధించడానికి ఒక మార్గముగా భక్తులు విశ్వసిస్తారని తెలిపారు. భిన్న సంస్కృతులు ,ప్రాంతాలు, భాషలు, కులాలు తదితర విభేదాలను విడనాడి ఒకే పందిరి కింద హాజరై సమైక్యతను చాటటం సంతోషదగ్గ విషయమని చెప్పారు. దైవ క్రమశిక్షణ కలిగి ఉండి, ఎదుటివారి పట్ల ప్రేమ కనబరచడం ద్వారా దేవుని వారసులుగా స్థానం సంపాదించవచ్చు అన్నారు. రక్షణ సువార్తను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. దుష్ట హృదయం లేకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. బైబిలు గ్రంథము నుండి పస్కా పండుగ, పెంతుకోస్తు పండుగ, పర్ణశాలల పండుగ వంటి శ్రేష్టమైన పండుగలను గురించి వివరించారు. ప్రార్థన ధూపం దేవునికి ఇష్టమని, ప్రతి ఒక్కరు ప్రేమ సమాధానాలు కలిగి ఉండాలని కోరారు. మానవ జీవన ప్రయాణం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. దైవజనులు, భక్తులను స్ఫూర్తిగా తీసుకొని ఆధ్యాత్మిక అభివృద్ధి సాధించాలని సూచించారు. అదేవిధంగా ప్రజలందరూ దేవునిపై ఆధారపడటం ద్వారా దేవుని దీవెనలు పొందడంతో పాటు, అన్ని అంశాలలో విజేతలుగా నిలుస్తారని తెలిపారు. తొలుత బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరీ రెవరెండ్ జే ఆగమనరావు, రెవరెండ్ డి. సుధాకర్ తదితరులు దైవ సందేశాలు అందించారు.



### భక్తులతో పోటెత్తిన మహోత్సవాల ప్రాంగణం

రెండు తెలుగు రాష్ట్రాల తో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చతిస్గడ్, కేరళ, బీహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు మరియు సింగపూర్ మలేషియా, అమెరికా, దుబాయ్ వంటి తదితర దేశాల నుండి వచ్చిన భక్తులతో సభల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మహోత్సవాలతోపాటు ఆదివారం దైవారాధన కూడా కావడంతో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దేవుని ఆరాధించారు. పెదకాకాని స్వస్తిశాలకు కూడా భక్తుల తాకిడి పెరిగింది. యవనస్తులు, సండే స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన క్రైస్తవ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ .జె. శామ్యేల్ కిరణ్ , వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి. జాన్ దేవదాసు , సెక్రటరీ రెవరెండ్ కె. ప్రశాంత్ కుమార్ , జాయింట్ సెక్రటరీలు రెవరెండ్ డి. సుధాకర్ , రెవరెండ్ జె. ఆగమన రావు , రెవరెండ్ ఎం. రవి మరియు గవర్నింగ్ బాడీ సభ్యులు సారధ్యంలో వివిధ కమిటీల కృషితో ఈ ఏడాది ఆధ్యాత్మిక క్రైస్తవ ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా ఆదివారం ప్రారంభమయ్యాయి.



## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా స్థాయిలో జరిగిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలగా నిలిచి ఆదివారం నరసరావుపేటలోని కలెక్టరేట్ లో జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతిక శుక్లా,ఇతర ఉన్నతాధికారులు చేతులు మీదుగా అవార్డులను అందుకున్నారు.పల్నాడు జిల్లా స్థాయిలో జరిగిన డిబేట్ లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన కె.దివ్యశ్రీ,వ్యాస రచనలో ద్వితీయ స్థానం సాధించిన జె.దివ్యశ్రీలకు బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు,హెచ్ఎం ఎ.శ్రీనివాసరెడ్డి,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బహుమతులు అందుకున్న విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులను హెచ్.ఎం ఎ.శ్రీనివాస రెడ్డి,చైర్మన్ జీ. హనుమంతరావు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.



## ఆదర్శనీయులు బిట్ర నాగరాజుకు ఘన సన్మానం

**పెదకూరపాడు,మేజర్ న్యూస్ :** ఆదర్శనీయులు బిట్ర నాగరాజు అని దేవాలయ నిర్మాణంలో నాగరాజు అందించిన చేయూత మరవలేమని బద్రావతి సమేత భవనాబుషి దేవాలయ చైర్మన్ అనుముల వెంకట్రావు అన్నారు.పెదకూరపాడు మండల పరిధిలోని లగడపాడు గ్రామంలో భద్రావతి సమేత భావన రుషి దేవాలయానికి సత్తెనపల్లి కి చెందిన డాక్టర్ బిట్ర నాగరాజు దేవాలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళాన్ని అందించారు.ఆదివారం దేవాలయ చైర్మన్ అనుముల వెంకట్రావు, బండారు వెంకటేశ్వర్లు( పెద్ద శ్రేష్టి)లు దుశాలువాలతో నాగరాజు ను ఘనంగా సన్మానించారు.అనంతరం రథసప్తమిని పురస్కరించుకొని భద్రావతి సమేత భావన బుషి స్వామి వారి కళ్యాణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ స్వామివారి దేవాలయానికి ఎటువంటి సహాయ సహకారం కావాలన్నా తాను ముందుంటానని అన్నారు. అనంతరం దేవాలయ చైర్మన్ అనుముల వెంకట్రావు ఆధ్వర్యంలో వచ్చినటువంటి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అనుముల పాపారావు, జి.నాగేశ్వరరావు, అనుముల రామారావు, బండారు నాగరాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగంపై విజ్ఞాన్ నిరుల విద్యార్థినుల ప్రమాణం

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజ్ఞాన్స్ నిరుల ఉమెన్స్ కాలేజ్ విద్యార్థినులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుంటామని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రాంగణంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాధిక మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా ఓటు వేయడం ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. యువత రాజకీయ అవగాహన కలిగి చైతన్యవంతులుగా మారాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, నైతిక బాధ్యతలపై అవగాహన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులలో పౌర బాధ్యతపై చైతన్యం మరింత పెరిగిందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు.





## కన్నుల పండువ గా భద్రావతి సమేత భావనా రుషి స్వామి కళ్యాణం

- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు - భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు
- స్వామి వారి ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** మండలంలోని పెదకూరపాడు, లగడపాడు, గారపాడు గ్రామాలలో బద్రావతి సమేత భావనా రుషి స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు కన్నుల పండుగా ఆదివారం నిర్వహించారు. రథసప్తమి పండుగను పురస్కరించుకొని పద్మశాలీయుల ఆధ్వర్యంలో స్వామివారి శాంతి కళ్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఆయా గ్రామాల్లో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆలోచనతో శాంతి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేకు జాము నుంచే స్వామివారికి సుప్రభాత సేవ, పుణ్యా వచనం, అనంతరం దేవాలయాల్లో ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామివారిని ఉంచి మంత్రోచ్ఛరణ మధ్య కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. పలువురు దంపతులు పీఠంపై కూర్చొని పూజా కార్యక్రమాలు చేపట్టారు.

## గురజాలలో జడ్పీ గర్ల్స్ హై స్కూల్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవం

**గురజాల మేజర్ న్యూస్ :** గురజాల జడ్పీ గర్ల్స్ హై స్కూల్ నందు జనవరి 25వ ఓటర్ల దినోత్సవం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పిఎస్ నెంబర్ 20. 21. 22. 23. జిఐసి కాలనీ నందు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు బహుమతులు అందజేశారు సీనియర్ సిటిజనులను సన్మానించారు ఈ సందర్భంగా బిఎల్వోలు ఎం వెంకటేశ్వర్లు. పి. ఆనంద కుమారి. వి. ఆగమన. ఆర్. రాణి. పాఠశాల ఉపాధ్యాయులు బి. పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యానికి ఊపిరి ఓటు హక్కు: వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి




**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** డబ్బు, కులం, మత ప్రలోభాలకు లోనుకాక సేవాభావం గల నాయకులను ఎన్నుకోవాలి అని వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి ఓటర్లకు సూచించారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జనవరి 25, ఆదివారం గుంటూరు ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో అవగాహనా సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు సామాన్యుడికి ఉన్న శక్తివంతమైన ఆయుధమని, ప్రజాస్వామ్య అభివృద్ధికి అది మూలస్తంభమని తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎస్‌హెచ్‌ఓ వ్యవస్థాపకులు డాక్టర్ సేవ కుమార్ మాట్లాడుతూ యువతలో ప్రజాస్వామ్య అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా 2011 నుండి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ 365 రోజుల పాటు సాగే నిరంతర ప్రక్రియ అని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. జెన్-జడ్ యువత చురుకైన భాగస్వామ్యంతోనే సరైన నాయకులు, బాధ్యతాయుతమైన ప్రభుత్వాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. గుంటూరు రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ మేధావి వర్గం ఓటింగ్‌కు దూరంగా ఉండటం వల్ల సరైన నాయకత్వం వెలుగులోకి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మేధావులు తమ మౌనాన్ని వీడి ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మానవత సంస్థ సెక్రెటరీ కే. సతీష్ మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెరిగేందుకు యువత ప్రజలలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్రజల పన్నుల ద్వారా ప్రభుత్వ సేవలు అందించే నాయకులను అత్యంత జాగ్రత్తగా, బాధ్యతతో ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మానవత ప్రెసిడెంట్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ పాతతరం నాయకుల ఆదర్శాలను నేటి తరం నాయకులు అనుసరించి ఎన్నికలలో నిజాయితీతో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానవత వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కల్పన, జాయింట్ సెక్రెటరీ జి. ఆనంద్, డాక్టర్ పరమేశ్వర రావు, విజయలక్ష్మి, మోక రాధాకృష్ణ, గ్రంథాలయ సంస్థ సిబ్బంది, పోటీ పరీక్షలకు సిద్ధ మవుతున్న విద్యార్థులు, సాధారణ పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## 30 సీఎం పర్యటన నేపథ్యంలో పనులు వెంటనే పూర్తి చేయండి

### నగర కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు కలెక్టర్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 30న ప్రభుత్వ వైద్యశాలలో నూతన భవన ప్రారంభోత్సవానికి వచ్చే అవకాశం ఉన్నందున, సదరు పర్యటన మార్గంలో రోడ్లపై గోతులు ఉండకుండా ప్యాచ్ వర్క్స్, డ్రైన్ల శుభ్రం, ఆక్రమణల తొలగింపులో జిఎంసి అధికారులు సమన్వయంతో 2 రోజుల్లో పూర్తి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. ఆదివారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుండి నగరంపాలెం వైపుగా జిజీహెచ్ వరకు విభాగాధిపతులతో కలిసి పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన జరిగే పెరేడ్ గ్రౌండ్ నుండి జిజీహెచ్ వరకు పారిశుధ్యం, ఆక్రమణల తొలగింపు, ప్యాచ్ వర్క్ లు చేపట్టడానికి, పర్యవేక్షణకు విభాగా ధిపతులు, డిప్యూటీ కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేయాలని అదనపు కమిషనర్ ని ఆదేశించారు. ప్రదానంగా డ్రైన్లు శుభ్రం చేయాలని, సెంట్రల్ మీడియన్స్, ఐలాండ్స్ శుభ్రంగా ఉంచాలన్నారు. చాలా ప్రాంతాల్లో నిర్మాణ వ్యర్ధాలను గమనించామని, వాటిని తొలగించా లని సిటి ప్లానర్ ని ఆదేశించారు. పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, వేణు గోపాల్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

# బాలిక బలమే దేశ బలం

### డాక్టర్ ఎన్.అనిత ప్రముఖ గైనకాలజిస్ట్




**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జనవరి 24 వ తేదీన గుంటూరు చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రసిద్ధ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్. అనిత హాజరై బాలికలకు ఆరోగ్యం, పరిశుభ్రత, జీవనశైలిపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్. అనిత మాట్లాడుతూ జాతీయ బాలిక దినోత్సవం మనకు ఒక సత్యాన్ని గుర్తు చేస్తుంది అని తెలిపారు. ఒక బాలిక ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో, విద్యావంతంగా, శక్తిమంతంగా ఎదిగితే కుటుంబం బలపడుతుంది దేశం బలపడుతుంది, ప్రపంచం బలపడుతుంది అని తెలిపారు. బాలికలు తమ శరీరాన్ని అమూల్యంగా భావించాలన్నా రు. చిప్స్, చాక్లెట్లు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి పౌష్టికాహారం తీసుకోవాలని, రోజూ సరిపడా నీరు త్రాగాలని, మంచి నిద్రతో పాటు వ్యాయామాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాసిక ధర్మం సహజమైన ప్రక్రియేనని, దానిపై ఎలాంటి లజ్జ అవసరం లేదని పేర్కొన్నారు. పరిశుభ్రమైన శానిటరీ ప్యాడ్లు లేదా సురక్షితమైన మెన్స్ట్రువల్ ఉత్పత్తులు వినియోగించా లని, ప్రతి 46 గంటలకు ఒకసారి ప్యాడ్ మార్చుకోవాలని సూచించారు. అలాగే అధిక స్క్రీన్ టైమ్ వల్ల కంటి ఆరోగ్యం, మానసిక స్థితి, నిద్ర, ఆత్మవిశ్వాసం దెబ్బతింటాయని హెచ్చరించారు. బయట ఆడుకోవడం, కుటుంబ సభ్యులతో మాట్లాడడం, సమాజంతో మమేకమవడం ఎంతో అవసరమన్నారు. పీర్ ప్రెజర్‌కు లోనుకాకుండా స్వయంవిశ్వాసంతో ముందుకు సాగాలని బాలికలకు పిలుపునిచ్చారు. తదుపరి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రెటరీ కే. సతీష్ మాట్లాడుతూ బాలికలు బలహీనులు కారు, వారు బలవంతులు, శక్తిమంతులు అని తెలిపారు. ఆడపిల్లను బ్రతకనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం అని కోరారు. బాలికల విద్యాభివృద్ధి దేశ పురోగతికి స్పష్టమైన సంకేతం అని వివరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు పద్మజ మాట్లాడుతూ సృష్టికి స్త్రీ మూలం అని, నేటి బాలికలే రేపటి మహిళలు అవుతారు అందువల్ల ఆరోగ్యవంతమైన జీవన విధానాలను చిన్న వయస్సు నుంచే అలవర్చుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు జరిగిన పరీక్షలలో ప్రతిభ కనబరిచిన ప్రతి తరగతి విభాగంలోని మొదటి, ద్వితీయ ర్యాంక్ విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం డాక్టర్ ఎన్. అనితని ఉపాధ్యాయ బృందం, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవత డైరెక్టర్లు తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , గుడివాడ శ్రీనివాసరావు, శివాజీ, రాధాకృష్ణ, పావని, పాఠశాల ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



## గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** గుంటూరులో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదివారం పరిశీలించారు. ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి వేడుకలు గుంటూరులో పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. ఉదయం 11.30 గంటలకు వేడుకలు ప్రారంభం అవుతుందని తెలిపారు. జెండా వందనం, జిల్లా కలెక్టర్ ప్రసంగం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల బహుకరణ ఉంటుంది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, తహసిల్దార్ వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పవిత్రమైనది

**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పవిత్రమైనదని, ప్రతి వాటర్ ఎలాంటి ప్రలోభాలకు అందకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, సివిల్ సప్లై డిఎం బి.నారధముని అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నియోజకవర్గ స్థాయిలో పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవంపై ఐదు మండలాల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం వంటి పలు పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అధికారులు బహుమతులు అందించారు. అనంతరం ఉత్తమ బూతులు ఏమైనా





అధికారులకు ప్రశంస పత్రాలు అందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులతో కలసి అధికారులు మానవహారంగా ఏర్పడ్డారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుటామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నార్లై మాగులూరి భానుప్రకాష్, ఐదు మండలాల తహశీల్దార్లు మీసాల దానియేలు, నీలి ధనలక్ష్మి, వెంకటనాగరాజు, సి.హెచ్. శ్రీనివాసరావు, టి.ప్రవీణ్ కుమార్ మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, ఏకుల ప్రసాదరావు, పెదకూరపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎమ్ కాకాని వెంకట రమణ, 75 త్యాళ్లూరు, పెదకూరపాడు ఐసిడిఎస్ సూపర్ వైజర్లు ఇమాంబీ, వి. మాధవి సిబ్బంది ప్రదర్శనలో పాల్గొన్నారు.

## డి.ఆర్.ఓ ఖాజావలికి రాష్ట్ర స్థాయి అవార్డు



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి ఉత్తమ ఎలక్టోరల్ విధానాలను అమలు చేసినందుకు రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా అవార్డును ఆదివారం అందుకున్నారు. ఈ ఏడాది "నా భారత్ - నా ఓటు" (మై ఇండియా, మై ఓట్) థీమ్ తో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రియాశీలకంగా పనిచేయడంతో జిల్లా రెవిన్యూ అధికారికి అవార్డు లభించింది.

# ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల గ్రామాలలోని ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు . గ్రామంలోని .తాసిల్దార్ కార్యాలయం నకు ఎదురుగా నున్న ఆనంద్ ఫోటో స్టూడియో నుండి ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు ద్విచక్ర ర్యాలీ నిర్వహించారు . పోలీస్ స్టేషన్, శివాలయం సెంటర్ మీదుగా గ్యాస్ కంపెనీ వరకు కొనసాగింది. అనంతరం కంఠం రాజు కొండూరు గ్రామంలో గల శ్రీ మహంకాళిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అసోసియేషన్ కు సంబంధించిన విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ కే. భాస్కరరావు, వి రాజశేఖర్, బి శ్రీనివాసరావు ,పి చైతన్య, ఐ శివ నాగేశ్వరరావు, జి ఆనంద్, బి రమేష్, ఎం సత్యం, పి చైతన్య, జి గోపికృష్ణ, శేషగిరిరావు ,వాసు, ఎం రాంబాబు ,తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం పి.జి.ఆర్.ఎస్ లేదు



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్), రెవెన్యూ క్లినిక్ ల నిర్వహణ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం ఉండదని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా యంత్రాంగం గణతంత్ర దినోత్సవ నిర్వహణలో నిమగ్నమై ఉన్నందున పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల నిర్వహణ జరగదని, ప్రజలు దీనిని గమనించి వ్యయ ప్రయాసలకు లోనై రావద్దని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ బడి పిల్లల చేతిరాత పండుగకు హాజరైన బాలికోన్నత పాఠశాల విద్యార్థు నులు



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల గ్రామంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థు నులు గుంటూరు కాలేజీలో జరిగిన ఆరవ లిఖి. తోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలికోన్నత పాఠశాల కు చెందిన నలుగురు విద్యార్థు నులు మన ప్రభుత్వ బడి పిల్లల చేతి రా త పండుగ లో పాల్గొన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ శోభా దేవి.తెలిపారు.

# దుగ్గిరాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం




**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్యం ప్రజలకు ఇచ్చిన బలమైన ఆయుధం ఓట నీ. ఓటును వినియోగించి మంచి పాలకుల.ను నిలబెట్టేందుకు వినియోగిద్దాం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం అంటూ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు .జాతీయ ఓటర్ల దినోత్సవంను పురస్కరించుకుని దుగ్గిరాల రెవిన్యూ కార్యాలయం కార్యాలయం నుండి ర్యాలీ కొనసాగింది. పోలీస్ స్టేషన్ శివాలయం సెంటర్ కు చేరుకుంది, శివాలయం సెంటర్లో మానవహారం నిర్వహించి, ఓటు హక్కు వినియోగం గురించి తెలియజేశారు. తాసిల్దార్ ఐ సునీత ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. సునీత మాట్లాడుతూ ప్రతి ఏడాది జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. 2011 నుంచి ప్రతి ఏడాది అన్ని రాష్ట్రాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించుచున్నారని అన్నారు .గ్రామాల్లోని ఓటు యొక్క ప్రాముఖ్యతను గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు .ఓటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక పోటీలు ఏర్పాటు చేశారు .ఓటు హక్కు వినియోగం వల్ల మంచి పాలకులను నిలబెట్టేందుకు వినియోగించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేజే నెహ్రూ, డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ ఏఎస్ఓ పివి సూర్యనారాయణ, ఆర్ ఐ మల్లేశ్వరి, జేవి దుర్గ, విఆర్వోలు అనిల్ వర్మ , జయ కాంత్, , వీఆర్ఏలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక విశిష్టత - ప్రాకృతిక ప్రాముఖ్యత
# రథ సప్తమిన హోమం చేసిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



**గుంటూరు కలెక్టర్ మేజర్ న్యూస్ :** దేశమంతటా అత్యంత వైభవంగా జరుపుకునే ప్రముఖ పండుగలలో రథ సప్తమి ఒకటని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత మాత్రమే కాక ప్రాకృతిక ప్రాముఖ్యత కూడా కలిగి ఉండడం ఈ పండుగ ప్రత్యేకతగా ఆయన అభివర్ణించారు. రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని చౌడవరం సమీపంలోని అవధూత దత్త పీఠమైన "దం" దత్తనాథ క్షేత్రంలో శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో.. అత్యంత భక్తి శ్రద్ధలతో.. శాస్త్రోక్తంగా శ్రీ రాజ శ్యామల సహిత సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. అనంతరం వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం కన్నుల పండుగలా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, సృష్టిలో సమస్త జీవరాశులకు శక్తి మూలమైన సూర్య భగవానుడి జయంతి రోజునే రథ సప్తమిగా జరుపుకోవడం మనకు అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని తెలిపారు. అందుకే సనాతన ధర్మంలో సూర్యారాధనకు విశిష్టమైన స్థానం ఉన్నట్లు ఆయన చెప్పారు. అనారోగ్యం లేని జీవితం కోసం సూర్యారాధన తప్పనిసరి అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆధ్యాత్మికంగానే కాక ప్రాకృతిక ధర్మంగా కూడా రథ సప్తమికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. వసంత కాలం, పంట కోతల కాలం ప్రారంభానికి ఇది ప్రతీక అని వివరించారు. నూతన సంవత్సర శుభప్రదమైన ఆరంభంగా భారతీయ రైతులు రథ సప్తమిని పరమ పవిత్రమైన పర్వదినంగా భావిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమం ప్రతినిధులు బొంతు సీతారామిరెడ్డి, యశ్వంత్ కుమార్, వెంకటేశ్వరరెడ్డి, రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల సాఫ్ట్ బాల్ జట్టుకు వాగ్దేవి డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎంపిక



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పురుషుల సాఫ్ట్ బాల్ జట్టు పోటీలు జనవరి 22 మరియు 23 తేదీలలో ఆర్ విఆర్ & జె సి ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణం నందు జరిగినవి. ఈ పోటీలకు యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలల జట్లు పాల్గొన్నాయని, మా వాగ్దేవి డిగ్రీ కాలేజీ జట్టు దనలక్ష్మి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ముప్పాళ్ల మరియు మామ్ కాలేజీ, కేసానుపల్లి జట్ల పై గెలు పొంది 4త్ ప్లేస్ సాదిం చడం జరిగిందని, మా వాగ్దేవి డిగ్రీ కాలేజీ విద్యార్థి మల్లవరపు ఏసుబాబు మంచి ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా సాఫ్ట్ బాల్ జట్టుకు ఎంపికయ్యాడని, ఈ విశేష విజయం ఆయన కఠిన సాధన, క్రమశిక్షణ మరియు నిరంతర కృషికి నిదర్శనమని, ఆల్ ఇండియా స్థాయిలో ఎంపిక కావడం విద్యార్థికి మాత్రమే కాకుండా, వారి తల్లిదండ్రులు మరియు మా కళాశాలకూ గొప్ప గౌరవాన్ని తీసుకువచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆల్ ఇండియా టోర్నమెంట్ ఫిబ్రవరి 01 నుండి ఫిబ్రవరి 10 వ తేదీ వరకు మహా రాష్ట్ర లోని అమరావతి యూనివర్సిటీ నందు జరుగుతుందని, ఈ టోర్న మెంట్ కు మా వాగ్దేవి డిగ్రీ కాలేజీ విద్యార్థి మల్లవరపు ఏసుబాబు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీం తరపున ఆడతాడని కళాశాల సెక్రటరీ & కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు.ఈ సంద ర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను కళాశాల చైర్మన్ కాట్ల రామకోటే శ్వరరావు, కళాశాల డైరెక్టర్స్ ఓగూరి నాగేశ్వర రావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్సాపల్లి క్రిష్ణకిషోర్, ఫిజికల్ డైరెక్టర్ డా. రాజా మెర్సిన్, అధ్యా పకులు మరియు సిబ్బంది అభినందించారు.




# పల్లె పండుగ 2.0 తో " పాఠశాలకు రక్షణ"

## -రూ.43 లక్షల తో మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడల ఏర్పాటు.
## - బొల్లవరం పాఠశాలలో ప్రారంభమైన పనులు



**ముప్పాళ్ల, మేజర్ న్యూస్ :** ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణం కూటమి ప్రభుత్వంలో సాకారం కానుంది. పల్లె పండుగ 2.0 లో నిధులను కేటాయించి పనులను ప్రారంభిస్తున్నారు. పల్నాడు జిల్లా పరిపాలనాధికారి నుండి అనుమతులు మంజూరు కావటంతో మండలంలోని బొల్లవరం గ్రామంలో పనులు ప్రారంభమయ్యాయి. ముప్పాళ్ల మండలంలో రూ.43 లక్షలతో ఐదు పాఠశాలల్లో ప్రహరీ గోడలు ఏర్పాటు కానున్నాయి. దమ్మాలపాడు, బొల్లవరం, మాదల, ప్రాథమిక పాఠశాలలకు ఒక్కోదానికి రూ 10 లక్షలు చొప్పున నార్నె పాడు పాఠశాలకు రూ. 6 లక్షలు ఇదే గ్రామంలోని మరో పాఠశాలకు రూ. 7 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. వి బి- జి రాంజీ( వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్ గార్ ) పథకం నుండి నిధులు మంజూరు కాగా పిఆర్ ఇంజనీర్లు పనులను నిర్వహించనున్నారని ఏపీవో ఏడుకొండలు తెలిపారు.

# ఆర్.వి.ఆర్ & జె.సి.లో జాతీయ ఓటర్ల దినోత్సవం



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఓటు హక్కు కీలకమని , ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని మద్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్,పొలిటికల్ సైంటిస్ట్, జి . కోటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ & జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఓటు యొక్క ప్రాముఖ్యతను, ఓటు నమోదు ప్రక్రియను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, యువత ఓటు ప్రాముఖ్యతను అవగాహన చేసుకొని ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఓటు ప్రతిజ్ఞ చేయించారు. యువత ఓటు విలువను తెలుసుకుని, మంచి నాయకత్వాన్ని ఎన్నుకునే దిశగా ఆలోచించాలని, ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాదని, దేశ భవిష్యత్తును నిర్దేశించే గొప్ప బాధ్యత అని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు దేశ పౌరులుగా తమ బాధ్యతలను గుర్తించి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని కళాశాల సెక్రటరీ & కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్&డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ & అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగాల ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వజ్రాయుధం

## -- మున్సిపల్ కమిషనర్ ఇరువూరి శ్రీనివాస్



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఇరువూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం పరిష్కరించుకొని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారం ఓటు ద్వారానే లభిస్తుందని, నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు వేయడం ద్వారానే ప్రజాస్వామ్యం బాలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటు వేద్దాం - దేశాన్ని నిర్మిద్దాం అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, యువత స్వచ్ఛందంగా పాల్గొని తమ మద్దతును చాటారు. అనంతరం ఓటర్లు దినోత్సవం ప్రతిజ్ఞను అధికారులు అందరూ కలిసి స్వీకరించారు. ఈ ర్యాలీలో మున్సిపల్ అధికారులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమిని తక్కువ అంచనా వేస్తే మళ్లీ మునకే నష్టం

## -అక్కినపల్లి బాలయ్య సీపీఐ మండల కార్యదర్శి




పిడుగురాళ్ల,మేజర్ న్యూస్: కూటమిని తక్కువగా అంచనా వేసి.. నష్టపోయాం-- ఈ మాట వైసీపీ నాయకుల్లో చాలా మంది 2024 ఎన్నికల తర్వాత.. చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పటికీ చాలా మంది నాయకులు ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ఒక్కరిగా వస్తే.. ఉండే బలానికి నలుగురు కలిస్తే ఉండే బలానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. అదే 2024 ఎన్నికల్లో జరిగిందన్నారు అక్కినపల్లి బాలయ్య సీపీఐ పిడుగురాళ్ల మండల కార్యదర్శి ఈ మేరకు మీడియాతో అన్నారు.అప్పటికే వైసీపీ పాలనపై వ్యతిరేకతతో ఉన్న కొన్ని సామాజిక వర్గాలు చేతులు కలిపాయి. ఇది ఆ పార్టీకి నష్టాన్ని తెచ్చింది. ఇక.. ఇప్పుడా ఆయా సామాజిక వర్గాల్లో చిన్న పాటి వివాదాలు.. విభేదాలు ఉన్నా.. మరోసారి ఐక్యత కోల్పోయే దిశగా అయితే లేవు. ఇది వైసీపీకి పెను ప్రమాదంగా మారనుంది. దీనిని అంచనా వేయడంలో వైసీపీ తలకిందలు అవుతోంది. అంతా తమకు అనుకూలంగా ఉందని అనుకోవడం అన్ని రాజకీయ పార్టీలు చేస్తాయి కానీ.. వాస్తవాన్ని గ్రహించేందుకు ముందుకురావు. గతంలోనూ ఇప్పుడూ వైసీపీ ఇలానే చేస్తోందన్నారు. ఇప్పుడు వైసీపీకి కావాల్సింది..ఒంటరి పోరు కాదన్న అభిప్రాయం చాలా మంది పార్టీ నాయకుల్లో వినిపి స్తోంది. చేతులుకలిపేందుకు రెడీగా ఉన్న కమ్యూనిస్టులు సహా.. చిన్నా చితకా పార్టీలతో ముందుకు సాగితే.. అప్పుడు బలమైన కూటమిని ఎదుర్కొనే శక్తి వస్తుందనేటున్నారు. మహా అయితే.. ఆయా పార్టీలకు అన్నీ కలిపి ఓ 25 నుండి 30 సీట్లు వదులుకున్నా.. మిగిలిన వాటిలో పోటీ చేసేందుకు అవకాశం ఉంటుంది. పాదయాత్ర ప్రభావం కొనసాగినా 2019లోనూ 24 సీట్లను పార్టీ ఎలానూ ఓడిపోయింది.ఈ నేపథ్యంలో కూటమిని తక్కువగా అంచనావేసి.. ఒంటరి పోరుకు వెళ్లొద్దని నాయకులు కోరుతున్నారు. ఇక, కూటమి ప్రభావానికి వస్తే.. బలమైన నాయకుడిగా ఇటు చంద్రబాబు, అటు పవన్ కల్యాణ్ ఉన్నారు. మరోవైపు.. యువశక్తి, మెగా అభిమానులు, కమ్మసామాజిక వర్గం ఎన్నారైలు.. ఇలా.. కొంత వరకు కూటమి బలం ఎక్కడా తగ్గలేదు. పైగా.. వైసీపీని రాకుండా చేసేందుకు అంటూ కొన్ని పార్టీలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కర్ర విడిచి సాము చేయకుండా.. వాస్తవాల నేపథ్యంలో ముందుకు సాగితే బెటర్ అన్నది సూచన అని అన్నారు.

# రైతు సంఘం ఆధ్వర్యంలో గోడపత్రిక ఆవిష్కరణ



పిడుగురాళ్ల , మేజర్ న్యూస్: ఈనెల 29వ తేదీ నుండి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఎగ్జిబిషన్, సదస్సులు జరుగుతున్న సందర్భంగా జయప్రదం చేయాలని కోరుతూ పిడుగురాళ్ల మండలంలో శాంతినగర్ గ్రామంలో రైతులతో గోడపత్రికను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంఘం ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం సిఐటియు నాయకులు టం టం సుబ్బయ్య, తెలకపల్లి శ్రీనివాసరావు లు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం సముక్షోభంలో ఉందని దీన్ని పరిష్కారం చేయకుండా వ్యవసాయ చట్టాల్లో సవరణ చేస్తూ, నూతన చట్టాలను తీసుకొస్తే, వాటికివ్యతిరేకంగా రైతులు, కార్మికులు 13 నెలపాటు పోరాడి వెనక్కి నెట్టగలిగారని, రైతు డిమాండ్లను పరిష్కారం చేయడంలో మోడీ ప్రభుత్వం మీసాలు లెక్కిస్తుందని, క్షమాపణ చెప్పిన మోడీ మరల అదే విధానాలను గట్టిగా అమలు చేయాలని చేస్తున్నారు. స్వామినాథన్ సిఫార్సులు వ్యవసాయ రంగంలో అమలు చేయాలని , రైతు పండించిన అన్ని రకాల పంటలు గిట్టుబాటు ధర కల్పించాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని, రైతుకు ఉన్న అన్ని రకాల అప్పులను, విమోచన చట్టం తెచ్చి రద్దు చేయాలని, అన్ని రకాల పంటలకు కొనుగోలు చేయాలని, తదితర డిమాండ్లు పరిష్కరించాలని, కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానాలు చేస్తారని,ఈ సమావేశంలో రైతు సంఘం జాతీయ నాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పెద్దలు మేధావులు పాల్గొంటారని, వ్యవసాయాన్ని కాపాడుకుందాం, రైతుని రక్షించుకుందాం అనే నినాదంతో, ఈనెల 29వ తేదీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను, ఎగ్జిబిషన్ శ్రీ సదస్సును రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె భాస్కరు, కోనపు చెట్టి గోపి, కటికం శ్రీనివాసరావు, గోపాల్, జంపంగి శ్రీనివాసరావు, కొత్తపల్లి శివ శ్రీనివాసరావు, కేశవ ప్రసాద్, ఎస్ కే సుభాని, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు ప్రధానమనది

## -దాచేపల్లి లో విద్యార్థులచే ఓటు అవగాహన ర్యాలీ.



దాచేపల్లి 1.ఓటు అవగాహన ర్యాలీ లో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్.

దాచేపల్లి, మేజర్ న్యూస్ : 16వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆదివారం పల్నాడు జిల్లా దాచేపల్లి పట్టణం లో విద్యార్థులచే ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు.జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా దాచేపల్లి లోని సరస్వతీ డిగ్రీ కళాశాల విద్యార్థినిలతో కలిసి తహశీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, సరస్వతీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కోట సాయన్న లు నారాయణపురం లో ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు.నా దేశం -నా ఓటు నినాదం తో 16 వ జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమం కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిందని ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.అనంతరం సరస్వతీ డిగ్రీ కళాశాల లో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు.ప్రజాస్వామ్యానికి బలమైన పునాది ఓటు అని,18 ఏళ్ళు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కు కల్గి ఉండాలని కళాశాల కరస్పాండెంట్ సాయన్న తెలిపారు.ఈ దేశ ప్రధానమంత్రి,ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలన్న ఓటు ద్వారానే జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు వివరించారు.కేంద్ర ఎన్నికల సంఘం 2010 సంవత్సరం నుండి జనవరి 25 వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవం గా ప్రకటించిందని తద్వారా దేశం లోని ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు.అత్యధిక ఓటర్లు కల్గిన దేశం గా భారతదేశం బలమైన ప్రజాస్వామ్య దేశం గా ఉందన్నారు.ఈ కార్యక్రమం లో వీఆర్ఓ లు, సరస్వతీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం

మంగళగిరి, మేజర్ న్యూస్:మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెదవడ్లపూడిలో స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఐటి, విద్యాశాఖల మంత్రివర్యులు నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న గ్రామానికి చెందిన పేద మెరిట్ విద్యార్థిని ఆవుల శిరీష కు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. అన్నే చంద్రశేఖర్ పదివేల రూపాయలు, లింగినేని సుధాకర్ బాబు పదివేల రూపాయలు కలిపి 20 వేల రూపాయలు విద్యార్థిని శిరీష కు అందజేశారు. ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ హాజరై విద్యార్థిని శిరీష కు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేద మెరిట్ విద్యార్థిని ప్రోత్సహిస్తూ శిరీష కు చంద్రశేఖర్ గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. చంద్రశేఖర్ తమ పిల్లల సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, భవిష్యత్తులో కూడా మరిన్ని మంచి కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్, మొద్దుకూరి రమేష్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, యేళ్ళ శంకరరావు, వెలగపూడి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



# పిడుగురాళ్లలో జాతీయ ఓటర్ల దినోత్సవం




పిడుగురాళ్ల, మేజర్ న్యూస్: పట్టణంలో స్థానిక కళ్యం టౌన్ షిప్ నందు స్కాలర్స్ డిగ్రీ కాలేజీ నందు జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల అధ్యక్షులు ఆవుల జనార్ధనరావు పాల్గొని భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు గురించి వివరించి భారతదేశంలో యువతనీ ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం చేయటమే ప్రధాన లక్ష్యం అని, 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు, కులం ,మతం, భాష, ప్రాంతం, స్త్రీ పురుష, ధనిక బీద భేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు వేసే సౌకర్యాలు ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని, విద్యార్థులకు వివరించటం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొని ఓటింగ్ ప్రక్రియ, ఓటు హక్కు, ఓటింగ్ విధానం గురించి ప్రశ్నలు అడిగి జవాబులు తెలుసుకోవడం జరిగినది. లయన్స్ క్లబ్ సభ్యులు, కళాశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

# నేడు మంగళగిరిలో మంత్రి లోకేష్ పర్యటన

మంగళగిరి, మేజర్ న్యూస్: నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం మంగళగిరి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఆత్మకూరులో నూతనంగా నిర్మించిన లూథరన్ క్రీస్తు కరుణాలయం ఏఈఎల్సి చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు.

# బొల్లాపల్లి ఎమ్మార్వో ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం




వినుకొండ మేజర్ న్యూస్: 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బొల్లాపల్లి గ్రామంలోని పోలింగ్ బూత్ ల వద్ద దీపాలు ఏర్పాటు చేసిన ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో వీఆర్వోలు మరియు కూటమి నాయకులతో కలిసి జాతీయ ఓటర్ల కార్యక్రమంలో పాల్గొన్నారు, బొల్లాపల్లి తాసిల్దార్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు మరియు గ్రామ ప్రజలకు ఓటు విలువను ఆ ఓట్లు ఎలా వినియోగించుకోవాలి ఓటు యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు ఈ కార్యక్రమంలో వెల్లటూరు వీఆర్ఓ నరసింహారావు గ్రామ నాయకులు మరియు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం



గురజాల మేజర్ న్యూస్ : గురజాల ఆర్డిఓ కార్యాలయం నందు 16వ జాతీయ ఓట్ల దినోత్సవం ఆర్డీవో మురళి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్యబద్ధంగా నాయకులు ఎన్నుకునే అధికారాన్ని భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నదని తెలియజేశారు ముఖ్యంగా ఓటు హక్కు రావడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రధాన కారణమని కొనియాడారు ఎందుకంటే గతంలో ఓటు హక్కు అనేది భూస్వాములకు సంపన్నులకు అధికారులకు మాత్రమే ఉండేది కానీ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు భారత రాజ్యాంగాన్ని ప్రసాదించిన అంబేద్కర్ వలన ఓటు హక్కు అనేది ప్రసాదించబడింది అని తెలియజేశారు, మరియు గురజాల ఎమ్మార్వో ఎన్ దుర్గేష్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అర్హత కలిగిన వాళ్ళందరూ కూడా హోటల్లో గా నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు మరియు మందు కోసమో డబ్బు కోసమో ఓటు హక్కు అనేది కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు హక్కుతో మన రాజ్యాన్ని మనమే నిర్మించుకోవాలని తెలియజేశారు అంతేకాక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసరావు వీఆర్ఓస్ వీఆర్ఏలు సూపరింటెంట్ ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా భావన ఋషి కళ్యాణ మహోత్సవం



**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరంలో మిషన్ బావి సెంటర్లో వైభవంగా భద్రావతి సమేత భావన రుషి స్వామి వారి కళ్యాణ వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి పద్మశాలి సంఘం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ లక్కీ డీప్ లు నిర్వహించి బహుమతులు అందజేశారు. పద్మశాలి సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు దేవస్థాన అధ్యక్షులు పులిపాటి చిన్న భాస్కరరావు తెలిపారు రాత్రికి స్వామివారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

## శతాధిక వృద్ధురాలి మృతికి నివాళి



**తెనాలి, మేజర్ న్యూస్ :** రూరల్ మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు వేజెండ్ల ఆనందరావు సతీమణి విశ్రాంతమ్మ (101) మృతి చెందారు. గుర్రం విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పులూరి శరత్ తెనాలి న్యాయవాదుల సంఘం టిడిపి సెల్ అధ్యక్షులు ఇందుపల్లి రాజారామ్ తదితరులు విశ్రాంతమ్మ పార్థివ దేహానికి ఆదివారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రమేష్, రత్నం, సుద్ధపల్లి మురళీధర్, తెనాలి అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రథసప్తమి వేడుకలు



**తెనాలి, మేజర్ న్యూస్ :** స్థానిక వైకుంటపురంలో రథసప్తమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవస్థాన కార్య నిర్వహణ అధికారి వి అనుపమ మాట్లాడుతూ రథసప్తమి పురస్కరించుకొని వైకుంటపురం దేవస్థానం ఆధ్వర్యంలో పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## రథ సప్తమి సందర్భంగా దీపాలంకరణ లో వెంకటేశ్వర స్వామి వారు



**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ పట్టణంలో రథ సప్తమి సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస నగర్ లో వేంచేసి ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, నాలుగు వాహనాల పై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, కమిటీ సభ్యులు తెలిపారు. రథ సప్తమి సందర్భంగా స్వామి వారి గర్భాలయంలో విశేషంగా దీపాలతో ఆలంకరణ నిర్వహించినట్లు ఆలయ అర్చకులు శ్రావణ్ కుమార్ తెలిపారు.

# ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మార్గ్ ముఖద్వారం ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించిన- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



**పొన్నూరు, మేజర్ న్యూస్ :** పాడి రైతుల ఆరాధ్యుడు, క్షీర విప్లవానికి పునాది వేసిన మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ రెవెన్యూ శాఖ మంత్రివర్యులు, సంగం డెయిరీ మాజీ చైర్మన్ స్వర్గీయ ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి 32వ వర్ధంతి సందర్భంగా పొన్నూరు పట్టణంలో స్మారక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొన్నూరు శాసనసభ్యులు దూళిపాల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. పొన్నూరు పట్టణంలోని పాత పొన్నూరు ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా ఏర్పాటు చేసిన ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మార్గ్ ముఖ ద్వారాన్ని ఘనంగా ప్రారంభించారు. ముఖద్వార ప్రారంభోత్సవం అనంతరం తెలుగుదేశం పార్టీ స్థాపకుడు, మహానటుడు, ప్రజానాయకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని ఎమ్మెల్యే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గారు మాట్లాడుతూ నా తండ్రి దూళిపాల. వీరయ్య చౌదరి పేరు మీద మార్గ్ ప్రారంభించడం నా జీవితంలో ఒక గర్వకారణమైన క్షణం అన్నారు.. ఆయన జీవితమంతా రైతుల కోసం, సహకార రంగ అభివృద్ధి కోసం అంకితం అయింది. ఒకే రోజు ఈ మార్గ్ ప్రారంభంతో పాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉంది. ఇంత తక్కువ సమయంలో యువత ముందుకొచ్చి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయడం అభినందనీయం. ఈ ప్రాంత ప్రజలు ఎప్పుడూ పార్టీకి అండగా నిలుస్తారు. కులం, మతం తేడా లేకుండా అందరూ ఒకే కుటుంబంలా కలిసి పనిచేసే మంచి మనస్తత్వం ఈ ప్రాంత ప్రత్యేకత. తెలుగుదేశం పార్టీకి ఈ ప్రాంతం మొదటి నుంచి బలమైన స్థావరం. మా తండ్రి కాలం నుంచి నేటి వరకు ఈ ప్రాంత ప్రజలు మాతోనే ఉన్నారు. వారి ప్రేమ, మద్దతు మాకు పెద్ద బలం ముఖద్వారం విగ్రహ ఆవిష్కరణ అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు బండారుపల్లి. శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ నాయకులు, ధూళిపాళ్ళ కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

# 24వ చతుర్వింశతి వార్షిక బ్రహ్మోత్సవాలు



**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :** అన్నపూర్ణ నగర్ గోరంట్లలో వేచి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం సొసైటీ పెద్ద గుడి నందు (24వ) చతుర్వింశతి వార్షిక బ్రహ్మోత్సవశీలు నాలుగు రోజులు పాటు ఘనంగా నిర్వహించడ జరుగుతుందని ఆలయ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు ఆదివారం దేవస్థానం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వస్తి శ్రీ చాంద్రమానేన శ్రీ విశ్వాస నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి ప్రారంభమై మాఘ శుద్ధ త్రయోదశి వరకు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 28వ తేదీ జ్యోతి ప్రజ్వలన, అంకురార్పణ, 29 వ తేది జ్యోతి ప్రజ్వలన, ధ్వజారోహణ, గజవాహన సేవ, 30వ తేదీన శ్రీవారి కల్యాణం, చండీ హోమం, సువాసిని పూజ, గరుడ వాహన సేవ, 31వ తేదీన పూర్ణాహుతి, కుంభాభిషేకం, ధ్వజారోహణము, శేష వాహన సేవ , ద్వాదశ ప్రదక్షిణములు, ఉంజల్ సేవ లు జరుగుతాయన్నారు. అలాగే చుట్టు పక్కల నుండి భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవములకు దేవస్థానం నందు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులతో కలిసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ఆశీర్వాదం అందుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎర్రం శెట్టి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గజవల్లి శివ నారాయణప్రధాన కార్యదర్శి గజవల్లి శివ నారాయణ, కోశాధికారి దేవరశెట్టి సురేష్, ఉపాధ్యక్షులు ఆళ్ల శివారెడ్డి, ఉప కార్యదర్శిలు కంచర్ల శంకరరావు, కొండపాటూరి విచ్చే శ్వరరావు, కార్యవర్గ సభ్యులు, సేవా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలి స్కూల్స్ నందు బాలలత మేడం మోటివేషనల్ ప్రోగ్రాం



**వినుకొండ మేజర్ న్యూస్ :** స్థానిక గీతాంజలి స్కూల్స్ నందు ప్రముఖ ఐఏఎస్ కోచింగ్ అధినేత బాలలత మేడం చే మోటివేషనల్ ప్రోగ్రామును 9, 10 తరగతిలో విద్యార్థుల కొరకు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీమతి బాలలత మేడంగారు ముఖ్యఅతిథిగా విచ్చేసి చిన్నారులకు మోటివేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచి విద్యను ఆయుధంగా మలుచుకొని పోలియో వలన తన రెండు కాళ్లు పడిపోయిన జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నానని,రెండు పర్యాయాలు ఐఏఎస్ పరీక్షలు ఉత్తీర్ణురాలై, కేవలం ఉద్యోగం ద్వారా 30 సంవత్సరాలు మాత్రమే సేవ చేయగలనని అదే ఈ 30 సంవత్సరాలు చిన్నారు లను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దినట్లయితే దేశానికి ఎంతో సేవ చేయగలనని తలచి ఐఏఎస్ పదవికి రాజీనామా చేసి చిన్నారులు భవిష్యత్తు కోసం ఐఏఎస్ అకాడమీను స్థాపించి,ఎంతోమంది ఐఏఎస్ లను దేశానికి అందించానని కావున చిన్నారులందరూ చక్కగా విద్యలో రాణించి భావి భారత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా లాయిడ్ గ్రూప్ వారు నిర్వహిస్తున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ నందు డైరెక్టర్గా పనిచేస్తూ ఎంతోమంది చిన్నారులకు మార్గ నిర్దేశం చేస్తున్నానని చెప్పారు. అలాగే చిన్నారులు తమ తల్లిదండ్రులకు తమ గురువులకు మంచి పేరు తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. ఎన్ని అవరోధాలు ఎదురైన వెనకకు తిరగకుండా ముందుకు సాగుతూ మంచి లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని పిలుపునిచ్చారు. అంగవైకల్యం ఉన్నప్పటికీ తాను ఈ స్థాయికి చేరుకోవడానికి కటోర శ్రమ మరియు పట్టుదల మాత్రమేనని కాబట్టి చిన్నారులు చక్కగా శ్రమించి విద్యలు రాణించాలని పిలుపునిచ్చారు. శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది కాబట్టి ప్రతి ఒక్కరూ చక్కగా విద్యులు రాణించాలని కొనియాడారు. కార్యక్రమంలో ధనిక్ భరత్ విద్యా సంస్థల డైరెక్టర్ అజయ్ విక్రమ్, కందిమళ్ళ సాంబశివరావు, శవిరి రాజు,గీతాంజలి విద్యాసంస్థల కరెస్పాండెంట్ యెండ్లూరి లక్ష్మణ కిషోర్, ప్రిన్సిపల్ కృష్ణవేణి,పలు విద్యాసంస్థల డైరెక్టర్లు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వాసవి సేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నిక



**తెనాలి, మేజర్ న్యూస్ :** స్థానిక ప్రకాశం రోడ్ లోని వైశ్య విద్యార్థినిధి ప్రాంగణంలో ఆదివారం శ్రీ వాసవి సేవా సమితి నూతన పాలకమండలి ఎన్నికలను నిర్వహించారు. ఆర్యవైశ్య విద్యానిధి అధ్యక్షులు వెంకటప్పయ్య అధ్యక్షతన జరిగిన ఎన్నికలలో అధ్యక్షులుగా వరదా వెంకట శేషగిరిరావు, ఉపాధ్యక్షుడిగా తలశెట్టి సుధాకర్ రావు, కార్యదర్శిగా పెండ్యాల సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా తాళ్లూరి సూర్యనారాయణ, కోశాధికారిగా గ్రంధి సేతు మాధవరావు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్ష కార్యదర్శులు శేషగిరిరావు, సుబ్బారావు మాట్లాడుతూ సేవా సమితి అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. సభ్యులంతా తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలు ఆర్యవైశ్య ప్రముఖులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

### – రూ 1.25 కోట్లు ఆలయ పునః నిర్మాణం కొరకు విరాళం అందజేసిన దాతలు
### –ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు





**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేట మండలం ఇసప్పాలెం గ్రామంలో వెంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవ స్థానానికి నూతనంగా నియమితులైన చైర్మన్ బండ్లమూరి చంద్రశేఖర్‌తో పాటు పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు హాజరై, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి పాలక మండలి సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రస్తుతం మహంకాళి అమ్మవారి ఆలయంలో పునర్ని ర్మాణ పనులు కొనసాగుతు న్నాయని పేర్కొన్న ఎమ్మెల్యే, 2028 నాటికి ఆలయ నిర్మాణం పూర్తయ్యే విధంగా పాలక మండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఆలయ పాలకమండలి సభ్యులుగా రాజవరపు కృష్ణ, పిల్లుట్ల నాగేశ్వరరావు, కుంచాల పార్వతి, జింకల శ్రీనివాసరావు, జూపూడి పేరమ్మ, పిన్నెబోయిన రామయ్య, పి విజయలక్ష్మి, టి రమాదేవి జల్లి అయ్యప్ప, బిల్లా వెంకట విజయలక్ష్మి, నండూరి కాశీ కృష్ణ చేత ఆలయ కార్య నిర్వహణ అధికారి మాధవి లత ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆలయ పునః నిర్మాణం కొరకు భక్తులు రు 1.25 కోట్ల విరాళం ఎమ్మెల్యే చేతులు మీదుగా ఆలయ అధికారులకు అందజేశారు. కార్య క్రమంలో జనసేన నాయకులు సయ్యద్ జిలాని, కపిలవాయి విజయకుమార్, రంగిశెట్టి రామకృష్ణ, వాసిరెడ్డి రవి, కొల్లి బ్రహ్మయ్య, వీరవల్లి వంశీ, గట్టుపల్లి సత్యం, కొనకంచి కోటేశ్వరరావు, పమిడి జగన్నాధం, బండ్లమూరి నరసింహారావు, మెహర్, దాసరి నరసింహ రావు, ట్రావెల్స్ కోటి, సాంబశివరావు, గాడిపర్తి సురేష్, బండారుపల్లి విశ్వేశ్వరరావు, ఇండ్లమూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# 77వ గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం
# జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా







**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** రాష్ట్ర రాజధాని అమరావతిలో మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న 77వ గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం అయింది. ఈ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు, జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు, ఉన్నత అధికారులు ఇందులో పాల్గొననున్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న 77వ గణతంత్ర వేడుకలకు జంగారెడ్డి గూడెం ఏ ఎస్పీ, ఐ.పి.ఎస్ అధికారి ఆర్. సుస్మిత పరేడ్ కమాండర్ గా వ్యవహరిస్తు న్నారు. భారత ఆర్మీ , ఆంధ్రప్రదేశ్ 2వ పోలీస్ బెటాలియన్, సి.ఆర్.పి.ఎఫ్, పోలీసు సాయుధ దళాలు, ఆంధ్రప్రదేశ్ 16వ పోలీస్ బెటాలియన్, బాలురు, బాలికల విభాగాల ఎన్.సి.సి క్యాడెట్స్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థల విద్యార్థులు, రెడ్ క్రాస్ యువ దళం కంటింజెంట్స్, స్పెషల్ పోలీస్ బ్రాస్ బాండ్, స్పెషల్ పోలీస్ – భారత ఆర్మీ మ్యూజిక్ బాండ్ లు ఇందులో పాల్గొనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై 22 శాఖలు – వీటిలో వందేమాతరంకు 150 వసంతాలు ఇతివృత్తంగా సాంస్కృతిక శాఖ, పది సూత్రాల మిషన్ కింద పేదరికం లేని సమాజం (జీరో పొవర్టీ) ఇతివృత్తంతో ప్రణాళికా శాఖ, సెర్ఫ్ (సెర్ప్) శాఖ లు, జనాభా నిర్వహణ, మానవ వనరుల అభివృద్ధి (పోపులేషన్ మానేజ్మెంట్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్) ఇతివృత్తంతో ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లు, నైపుణ్యం, ఉపాధి (స్కిలింగ్, ఎంప్లాయిమెంట్) ఇతివృత్తంతో స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, పాఠశాల విద్యా శాఖ, పరిశ్రమల శాఖ, పర్యాటక శాఖ లు, నీటి భద్రత (వాటర్ సెక్యూరిటీ) ఇతివృత్తంతో జలవనరుల అభివృద్ధి శాఖ, మైక్రో ఇరిగేషన్, అటవీ శాఖ లు, రైతు–వ్యవసాయ సాంకేతికత (ఫార్మర్ అగ్రీ టెక్) తో వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ లు, ప్రపంచ ఉత్తమ లాజిస్టిక్స్ (గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్) అంశంతో మౌలిక వసతులు & పెట్టుబడులు, సముద్ర మరియు వైమానిక రంగాలు, సీఆర్డీఏ లు, వ్యయ అత్యుత్తమీకరణ (ఖర్చుతగ్గింపు) శక్తి, ఇంధనం (కాస్ట్ ఆప్టమిజషన్ ఎనర్జీ, ఫ్యూయల్) ఇతివృత్తంతో నెడ్కాప్ (ఇంధనం), ఉత్పత్తి పరిపూర్ణత (ప్రోడక్ట్ పర్ఫెక్షన్), చేనేత, జౌళి శాఖ, ఉద్యానవన శాఖ లు, స్వచ్ఛ ఆంధ్ర (స్వచ్ఛ ఆంధ్ర) పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ (స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్), పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ లు, జీవితంలోని అన్ని రంగాల్లో లోతైన సాంకేతికత – (డీప్ టెక్ ఆల్ వాక్స్ అఫ్ లైఫ్) ఇతివృత్తంతో ఆర్టీజీఎస్ శకటాలను ప్రదర్శించనున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, ప్రోటోకాల్ సంచాలకులు మోహన రావు, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



**పెదకూరపాడు మేజర్ న్యూస్:** పెదకూరపాడు మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన బెల్లంకొండ లక్ష్మీనారాయణ తండ్రి రాజు అను అతనికి మోకాలు ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఒక లక్ష 40 వేల రూపాయలు ఆర్థిక సహాయం పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ సూచనలు మేరకు మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య,జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు,రామాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మడి సురేంద్ర బాబు చేతుల మీదుగా పార్టీ కార్యాలయంలో చెక్కు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నరిశెట్టి అప్పారావు కొండవీటి అప్పారావు పాల్గొన్నారు.

## ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కు
### –తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు




**మాచవరం , మేజర్ న్యూస్ :** ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఇది ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని మాచవరం మండల తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసిల్దారు కార్యాలయం వద్ద నుండి గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు ఓటు అనేది ఒక ఆయుధమని తద్వారా సరైన రాజకీయ నాయకుడిని ఎంచుకునే అవకాశం ఉందన్నారు అలాగే ఓటును డబ్బుకు మద్యానికి అమ్ముకోకూడదని విలువలతో కూడిన ఓటును స్వచ్ఛంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కీర్తి సుధా స్రవంతి ఆయా గ్రామాల వీఆర్వోలు వీఆర్ఏలు రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవం



**తెనాలి, మేజర్ న్యూస్ :** రథసప్తమని పురస్కరించుకొని గౌరావజ్ఝల ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామలింగేశ్వరపేట నుండి బోస్ రోడ్ లోని చిట్టి ఆంజనేయస్వామి గుడి వరకు చిన్నారులు నగర సంకీర్తనలు చేస్తూ వీధి సంకీర్తన చేశారు. అనంతరం సుల్తానాబాద్ లోని అలపాటి నగర్ లో కుమార్ పంప్స్ వారి సౌజన్యంతో కొలువైన శ్రీ షిరిడి సాయిబాబా దత్తాత్రేయ స్వామి ఆలయంలో చిన్నారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గౌరావజ్ఝల ఆంజనేయ శాస్త్రి సారధ్యంలో త్యాగరాజ స్వామి ఆరాధన లో భాగంగా పంచరత్న కీర్తనలు, ఉపచార సంప్రదాయ కీర్తనలు చిన్నారులు ఆలపించారు. అనంతరం మంగళహారతి తీర్థప్రసాద వితరణ చేశారు. సంకీర్తనాలాపనకు శ్రీకృష్ణ అభిరామ్ వయోలిన్, మృదంగం సురేష్ బాబు, డోలు ప్రసాద్ లు వాద్య సహకారం అందించారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, వెంపటి సత్యనారాయణ , ములుకుట్ల రఘునాథ్ , అందె బాలచంద్రమౌళి ముఖ్య అతిథిలు గా విచ్చేయగా శ్యామ్, కుమార్, సుచరిత, అందె తన్మయి, జెనీత, ఇందిరా, దివ్యశ్రీ, కార్తీక్, కుమార్, సౌజన్య, రాజ రాజేశ్వరి, శ్రీలత, ప్రియాంక, శ్రీ శాంతి, సత్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో విదేశీయ విషమ సంస్కృతిని విడనాడాలి



**పెదకూరపాడు మేజర్ న్యూస్:** సమాజంలో విదేశీయ విషమ సంస్కృతిని విడనాడి స్వదేశీ సాంప్రదాయ శాస్త్రబద్ధమైన సంగీత పరిజ్ఞానంతో సమాజానికి విజ్ఞానాన్ని,వినోదాన్ని అందించడంలో నాటి పౌరాణిక జానపద నాటక రంగ కళాకారులు కృషి శక్తి వంచన లేనిదని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ అన్నారు.ఈ సందర్భంగా పెద్దకూరపాడు మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కళాకారుల సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని రామకృష్ణ మాట్లాడుతూ రాజిరిక వ్యవస్థనుండి నాటి సమాజం వరకు ప్రజలకు అవసరమైన సంగీత సాంస్కృతిక ను నాటక రూపంలో ప్రజలకు అందిస్తూ వృద్ధాప్యంలో సమాజానికి వెలుగు మార్గాన్ని చూపే నాటి కళాకారులు వృద్ధాప్యంలో ఆలన పాలన లేక కుటుంబ వ్యవస్థలో ఆదుకునే వారు లేక అర్ధాకలితో జీవితాన్ని గడిపే నాటి సమాజంలో కళాకారులకు ప్రభుత్వ పరంగా వృద్ధాప్య కళాకారులకు 6వేల రూపాయలు పెన్షన్ సదుపాయాన్ని రూపకల్పన చేసి ఆరోగ్యంవంతమైన జీవన విధానాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చే నూతనంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఏరియా కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజలో పౌరాణిక జానపద సాంఘిక నాటక రంగాలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కళాకారులకు ఉచిత కార్పొరేట్ల వైద్యం ప్రతినియెజ వర్గంలో ఓపెన్ థియేటర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.సమావేశంలో ఎర్ర మాస్ కృష్ణ బి.ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ ఏరియా కమిటీ సభ్యులు సేలం ముని, 75 తాళ్లూరు గ్రామ సిపిఐ శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఈపూరి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కృష్ణా నదిలో కలుపుతాం. కాసు మహేష్ రెడ్డి












**మాచవరం , మేజర్ న్యూస్ :** ఈ రాష్ట్రం అమలుపరుస్తున్న రెడ్బుక్ రాజ్యాంగాన్ని పక్కనే ఉన్న కృష్ణ నదిలో కలిపేస్తామని గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో మందా సాల్మన్ సంస్కరణ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి తిరుపతి ఎంపీ గురుమూర్తి,రాష్ట్రం నుండి మాజీ మంత్రి లు విడుదల రజిని, శైలజనాథ్, మాజీ హోం మంత్రి సుచరిత,మెరుగు నాగార్జున , మాజీ ఎంపీ నందిగామ సురేష్ ,మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బొల్లా బ్రహ్మనాయుడు, సుధాకర్ బాబు , మాజీ ఎమ్మెల్సీలు చుక్క యేసురత్నం, జూపూడి ప్రభాకర్ పార్లమెంటరీ ఇంచార్జి నాయకులు ప్రస్తుత ఎమ్మెల్యే చంద్రశేఖర్ పాల్గొన్నారు. మంద సాల్మన్ కుటుంబానికి అండగా ఉంటామని వైసిపి నాయకులు అన్నారు ఈ సందర్భంగా మందా సాల్మన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిందని కాసు మహేష్ రెడ్డి తనదైన శైలిలో ఈ హత్య రాజకీయాలను అడ్డుకొని మాట్లాడారని మాజీ మంత్రులు అన్నారు మందా సాల్మన్ సంస్కరణ కార్యక్రమానికి వేలాది సంఖ్యలో వైసీపీ శ్రేణులు తరలివచ్చారు.

# ఉత్తమ సేవలకు పురస్కారాలు

**– గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులు అందుకోనున్న తహసిల్దార్ నగేష్ ,సిఐ కిరణ్ తదితరులు**





**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులకు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల సోమవారం జిల్లా కేంద్రంలో అవార్డులు అందించనున్నారు. ఇందులో భాగంగా సత్తెనపల్లి నియోజకవర్గంలో పలువురికి ఈ పురస్కారం దక్కనుంది. పురస్కారాలకు ఎంపికైన వారిలో ముప్పాళ్ళ తహసిల్దార్ నగేష్, సత్తెనపల్లి రెవిన్యూ కార్యాలయ జూనియర్ సహాయకులు కబ్బిరెడ్డి, రూరల్ సీఐ పి. కిరణ్, ముప్పాళ్ళ స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఆర్ శ్రీనివాసరావు, పట్టణ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ పి సుబ్బారావు, పిఎస్ లు శివ ప్రకాష్, మని కృష్ణ, ఉప విద్యాశాఖ అధికారి వి ఏసుబాబు, ధూళిపాళ్ల సచివాలయ ఉద్యాన సహాయకుడు రామకోటిరెడ్డి, సహాయ కార్మిక శాఖ అధికారి వి అన్నపూర్ణ, వార్డు ఇమ్యూనిటీ సెక్రటరీ మణికంఠ వాసు, రాజుపాలెం వెలుగు సిసి కండ్లకుంట విజయమ్మ, నకరికల్లు మండల స్వర్ణ గ్రామ అధికారి ఏ శశికళ,, ఆర్ అండ్ బి ఏ.ఈ లు , జగదీష్ చంద్ర, ఇ వి కృష్ణారెడ్డి, పాకాల పాడు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ , పలువురు పోలీస్ కానిస్టేబుళ్లు కార్యాలయ సబ ఆర్డినేట్లకు ఉత్తమ పురస్కారాలు లభించాయి.

# రాజ్యాంగం ఇచ్చిన వజ్రాయుధం ఓటు హక్కు

## " మై ఇండియా మై వోట్ " నినాదంతో ఓటరు దినోత్సవ కార్యక్రమాలు ఆర్డీవో రమణ కాంత్ రెడ్డి



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు అని... సుస్థిరమైన, సమర్థవంతమైన ప్రభుత్వ ఏర్పాటుకు విలువైన ఓటు దోహదపడుతుందని సత్తెనపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి రమణ కాంతరెడ్డి అన్నారు. ఆదివారం 19వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ అనంతరం తాలూకా సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించి, ప్రశంస పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది కేంద్ర ప్రభుత్వం, జాతీయ ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో " మై ఇండియా మై వోట్ " అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా ఓట్లు నమోదు చేసుకొని, ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ విశిష్టమైన అవకాశాన్ని మనమందరం సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మీ ఓటు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలదని జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతి పౌరునికి గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ చక్రవర్తి ఆర్ఐ బోసు బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



**ముప్పాళ్లలో..**

మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు తహసిల్దార్ నగేష్ సిబ్బంది,ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్ దినోత్సవ నిర్వహణ,అవసరత,ప్రతి పౌరుడు ఓటును నమోదు చేసుకొని ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమములో డిప్యూటీ తహశీల్దార్,ఆర్ ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బగ్గి జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కన్నా

**– నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన శాసనసభ్యులు కన్నా**



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** మాజీ ఏపిపి బగ్గి నరసింహారావు జన్మదిన వేడుకలలో శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసి, విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితికి ఎదగాలన్నారు జన్మదినోత్సవాన్ని ఎ పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూరల్ మండల పరిధిలోని దూళిపాళ్ళగ్రామం నందు కృష్ణా ఫీడ్స్ వారి నూతన వ్యాపార ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణం నరసరావుపేట రోడ్ వి ఆర్ కన్వెన్షన్ నందు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణం నందు శ్రీ బద్రావతి సమేత శ్రీ భావనా ఋషి స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అబ్బురు రోడ్ నందు మద్దిగుంట వారి ఓణిల బహుకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాలలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ రామస్వామి, పట్టణ తెదేపా అధ్యక్షులు మస్తాన్ వలి,కూటమి అనుబంధ సంఘాల బాధ్యులు ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.



## రసాయన వ్యవసాయం వద్దు ప్రకృతి వ్యవసాయ ముద్దు



**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ మండలం ఏనుగుపాలెం గ్రామంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ చేపట్టిన ట్రైనింగ్ లో ఐసిఆర్పిలు మరియు ట్రైనింగ్ ఐసిఆర్పీలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం లో బీజామృతం ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ అబ్బూరి శివలక్ష్మి శిక్షణ ఇచ్చారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతిలో సహజసిద్ధమైన పదార్థాల ద్వారా తయారుచేసే పురుగు నివారణకు అజ్ఞాస్త్రం, బ్రహ్మాస్త్రం, గ్రోత్ ప్రమోటర్స్ కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం, చేప బెల్లం ద్రావణం మరియు మిరప లో వచ్చే నల్ల తామర పురుగు నివారణకు ఉల్లిగడ్డ కషాయం వంటివి తయారు చేసి ఏనుగుపాలెం గ్రామంలో గల ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో అందుబాటులో ఉంచారు. రసాయన ఎరువులు పురుగుమందుల అవశేషాలు ప్రజలు తినే ఆహార పదార్థాల్లో ఉండటం వల్ల క్యాన్సర్, షుగర్, హృదయ మరియు కాలేయ సంబంధిత ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడుతున్నారని, ప్రకృతి వ్యవసాయం చేసి భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరిచి తద్వారా రసాయన అవశేషాలు లేని ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయాన్ని ఒక ఉద్యమంగా ముందుకు తీసుకువెళ్లాలని ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ యల్లనూరి హనుమంతరావు పిలుపునిచ్చారు. ఐ సి ఆర్ పి లు రేణుక, అరుణ, గోవిందు, ట్రైనింగ్ ఐ సి ఆర్ పి లు ఇందిరా ప్రియదర్శిని, కృష్ణవేణి, విజయ భాయి, అనురాధ భాయి, స్నేహలత, వెంకట్రావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

## వేడుకగా రోటరీ 'నేషన్ బిల్డర్' అవార్డుల ప్రదానోత్సవం






**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'నేషన్ బిల్డర్' అవార్డుల ప్రదానోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మంగళగిరి నగర సమీప లిటిల్ విలేజ్ ఫంక్షన్ హాలులో మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సమాజం, దేశ నిర్మాణానికి విశిష్ట సేవలు అందించిన ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించేందుకుగాను మంగళగిరి రోటరీ క్లబ్ విద్యార్థుల ఫీడ్ బ్యాక్ ఆధారంగా మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 28మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను ఎంపికచేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 డిస్ట్రిక్ట్ లెర్నింగ్ ఫెసిలిటేటర్ పీడీజీ తాళ్ల రాజశేఖర్ రెడ్డి, అతిథులుగా బేసిక్ ఎడ్యుకేషన్, లిటరరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ రొటేరియన్ బండారు లక్ష్మీనారాయణరావు, అసిస్టెంట్ గవర్నర్ ఈవీ పూర్ణచంద్ లతోపాటు మంగళగిరి రోటరీ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి ఇసునూరు, కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, కోశాధికారి కేవీఎస్ ప్రకాశరావు, సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ చనుమోలు గోపాల్, పాస్ట్ ప్రెసిడెంట్లు గాజుల శ్రీనివాసరావు, త్రిపురమల్లు సతీష్ బాబు, పాస్ట్ సెక్రటరీ అందె మురళీమోహనరావు, రొటేరియన్లు అందె రేవంత్ కుమార్, మాయకుంట క్రాంతికుమార్, రావెల శ్రీనివాసరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, కె.రాజ్ కుమార్, జొన్నాదుల బిక్షారావు, కన్నెగంటి వెంకటేశ్వర్లు, గల్లా అమరేష్, డాక్టర్ నవీన్ కుమార్, అవార్డు గ్రహీతలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. నేషన్ బిల్డర్ అవార్డుకు ఎంపికయిన ఉపాధ్యాయినీఉపాధ్యాయులను శాలువా, పూలదండ, మెమెంట్, సర్టిఫికెట్ లతో సముచిత రీతిన సన్మానించి రొటేరియన్లు తమ అభిమానాన్ని చాటుకున్నారు. అవార్డులు పొందిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. వారితోపాటు కుటుంబసభ్యులు ఆ ఆనందంలో పాలు పంచుకున్నారు. నగరాల్లో జరిగే అవార్డుల ప్రదానోత్సవాలకు ఏమాత్రం తీసిపోనిరీతిలో మంగళగిరి రోటరీక్లబ్ 'నేషన్ బిల్డర్ అవార్డు'ల ప్రదానోత్సవం నిర్వహించడం విశేషం.

# రాష్ట్ర అభివృద్ధి మీద విషం చిమ్ముతున్న జగన్ రెడ్డి : యాగంటి

**మాచర్ల మేజర్ న్యూస్:** మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు మాచర్ల లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగుళూరు ఎలహంక ప్యాలెస్ లో విశ్రాంతి తీసుకుంటూ అప్పుడప్పుడు చుట్టం చూపుగా ఆంధ్ర రాష్ట్రానికి వచ్చి కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి కడుపు మంటతో ప్రజలు తనను ఎక్కడ మర్చిపోతారని భయంతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల మీద తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పు తప్పుదారి పట్టించాలని జగన్ రెడ్డి చేస్తున్న కుటీల నీతిని ప్రజలను నమ్మే పరిస్థితి లేదు అని అన్నారు. దేవతలు నడయాడిన ప్రజా రాజధాని లో నిర్మిస్తున్న నిర్మాణాల మీద కూడా కూటమి ప్రభుత్వం అధిక ఖర్చు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నాడని చదరపు అడుగు కి రాజధానిలో కేవలం 5000 నుంచి 6000 రూపాయలు మాత్రమే ఖర్చు పెడుతుందని వెల్లడించారు..

పారిశ్రామికవేత్తలకు రియల్ టైంలో( స్పీడ్ అప్ బిజినెస్ ) అనుమతులు ఇస్తూఏపీకి బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చారు చంద్రబాబు అని భారతదేశానికి వచ్చే పెట్టుబడులలో 25% ఒక ఆంధ్ర రాష్ట్రానికి వచ్చాయని ఎంతో శుభసూచకమని అది కేవలం నారా చంద్రబాబు నాయుడు మీద ఉన్న నమ్మకంతో వచ్చాయని వచ్చే 20 సంవత్సరాలు కూటమి పార్టీలు అధికారంలో ఉంటాయి అనే దృఢ సంకల్పంతో రాష్ట్రంలోకి 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి అని రాష్ట్ర ప్రజలందరూ కూడా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం, ఆంధ్ర రాష్ట్రానికి వస్తున్న భారీ పరిశ్రమలు, ఆంధ్ర రాష్ట్రంలో భారీగా నిర్మిస్తున్న నీటి పారుదల ప్రాజెక్టుల్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలని రాష్ట్ర ప్రజలను కోరారు..

□■ వైసీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ రెడ్డి జల్సాల కోసం పబ్జి ఆటలు ఆడుకోవడం కోసం రుషికొండ మీద నిర్మించిన ప్యాలెస్ చదరపు అడుగుకి 15,600 ఖర్చు పెట్టింది నిజం కాదా ఇది రాష్ట్ర ప్రజలు మొత్తం తెలిసిందే కదా అని అంటే దాదాపుగా 580 కోట్లు ప్రజాధనాన్ని తన విలాసలా కోసం జగన్మోహన్ రెడ్డి ఖర్చు పెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.అమరావతిని ప్రపంచం మెచ్చేలా భారతదేశం గర్వపడేలా నారా చంద్రబాబునాయుడు నిర్మిస్తున్నారని తెలిపారు.కూటమి పార్టీలు అధికారం లోకి వచ్చిన తర్వాత నారా చంద్రబాబు నాయుడు పరిపాలన, రాజకీయ అనుభవంతో వెంటిలేటర్ మీద ఉన్న ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో మెరుగుపరుస్తూ చక్క దిద్దుతున్నారని తెలిపారు.



□■ చంద్రబాబు 2019 నాటికి పోలవరం ప్రాజెక్టు 71 % పూర్తి చేస్తే జగన్మోహన్ రెడ్డి గత ఐదు సంవత్సరాల అధికారంలో కేవలం 3% పర్సంటేజ్ చేశాడు అని వెల్లడించారు.. 2024 లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం ప్రాజెక్టుని పరుగులు పెట్టిస్తున్నారు అని 2027 మార్చి నాటికి పూర్తి చేసి పోలవరం ప్రాజెక్టుని జాతికి అంకితం చేయాలని నిబద్ధతో పని చేస్తున్నాడు చంద్రబాబు నాయుడు అని వెల్లడించారు.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తన క్రెడిట్ చోరీ చేశారు అని గగ్గోలు పెడుతున్నావ్ జగన్ రెడ్డి! ఏమిటి చంద్రబాబు నీ క్రెడిట్ చోరీ చేసింది అని ప్రశ్నించారు.

వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్ర రాష్ట్రాన్ని గంజాయి వనంగా తయారు చేశావు.. నారా చంద్రబాబునాయుడు ఈగల్ టీంను ఏర్పాటు చేసి గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేసినందుకు క్రెడిట్ చోరీ చేశారు అనాలా జగన్ రెడ్డి అని ప్రశ్నించారు.జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచి రాష్ట్ర ప్రజలను పిప్పి పిండి చేశాడు. కానీ చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు భారీగా తగ్గించి రాష్ట్ర ప్రజలకు ఉపశమనం లభించేలా చేశారు అందుకు క్రెడిట్ చోరీ అనరా జగన్ రెడ్డి అని అన్నారు. గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో కల్తీ మందు, మైన్స్, శాండ్ ,ఇలా అన్నిట్లల్లో దోపిడీ చేసింది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కదా అని ప్రశ్నించారు..చంద్రబాబు నాయుడు తన క్రెడిట్ ను చోరీ చేస్తున్నాడని గగ్గోలు పెడుతున్న జగన్ రెడ్డి నీకు ఉన్న క్రెడిట్ ఏమిటి ల్యాండ్ మాఫియా, గంజాయి మాఫియా, డ్రగ్స్ మాఫియా నీ దగ్గర ఉంచుకో అలాంటి క్రెడిట్ మా చంద్రబాబు నాయుడు కు అవసరం లేదు అని జగన్ మోహన్ రెడ్డికి చురకలు అంటించారు.రాష్ట్రంలో ఉన్న రైతు సోదరుల పట్టాదారు పాస్ పుస్తకాలు మీద నీ బొమ్మ వేసుకొని పంపిణీ చేస్తే నారా చంద్రబాబు నాయుడు రాజముద్ర తో రాష్ట్ర ప్రజలకు పంపిణీ చేయడమే క్రెడిట్ చోరీ అనలా జగన్ రెడ్డి అని అన్నారు.అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు

□■ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి భక్తులు పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూని పాలే లేని కల్తీ నెయ్యితో, రసాయనాలతో కల్తీ చేసిన జగన్ రెడ్డి & కో ఆ పాపకార్యం ద్వారా రూ.250 కోట్ల స్కామ్ చేసింది నిజమే అని ఇది వాళ్ళో వీళ్లో చెప్పిన మాట కాదు అని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు చేసి నిగ్గు తెలిచిన పచ్చి వాస్తవం కదా అని వెల్లడించారు. జగన్మోహన్ రెడ్డికి ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకు ఆంధ్ర రాష్ట్రాన్ని దివాలా తీయించిన వ్యక్తి జగన్ రెడ్డి అని జగన్మోహన్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు ఎవరు కూడా నమ్మవద్దని నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో యాగంటి మల్లికార్జున రావు తో పాటు టిడిపి నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.